క్లుప్తంగా

నేడు మజ్జి సంస్మరణ సభ

మందస: పీసీసీ మాజీ అధ్యక్షుడు, స్వర్గీయ మజ్జి తులసీదాస్ 29వ సంస్మరణ సభను గురువారం మందసలో ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. తులసీదాస్ కుమారుడు మజ్జి త్రినాథ్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతోందన్నారు.

టీచర్ బదిలీ సబబు కాదు

మందస: మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న రమాదేవిని విద్యా సంవత్సరం మధ్యలో బదిలీ చేయడం తగదని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎం రామచంద్రపాణిగ్రాహికు బుధవారం వినతిపత్రం అందజేశారు. పేరెంట్స్ కమిటీకి కూడా తెలియకుండా రిలీవ్ చేయడం అన్యాయమన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా తక్షణమే సైన్స్ పోస్టును భర్తీ చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో పాఠశాల అభివృద్ధి కమిటీ నాయకులు వడ్డి గోపాలకృష్ణ, మట్ట ధర్మారావు, ఆర్.రంగా, బి.భాస్కరరావు, ఎస్.వల్లభ, కె.చిరంజీవి, రమేష్, సరస్వతి, కమల, వేణు ఉన్నారు.

నేడు హరిపురంలో స్వర్ణోత్సవ బైక్ జాతా

మందస: హరిపురంలో గురువారం స్వర్ణోత్సవ బైక్ జాతాను నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. హరిపురంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకత్వం, ఎమ్మెల్సీలు పాల్గొనే ఈ కార్యక్రమంలో అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యంగా జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు లండ బాబూరావు, ఎస్.కిశోర్, గుంట కోదండరావు కోరారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలోని సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ సేవలను అధికారులు బుధవారం ప్రారంభించారు. తురకవీధి సచివాలయంతోపాటు మరికొన్ని చోట్ల సేవలను అందిస్తామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎస్.రమేష్ కోరారు. ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లయిన ప్రతిఒక్కరూ విధిగా కచ్చితంగా అప్‌డేట్ చేయించుకోవాలన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే

- టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమార్

టెక్కలి: ఇంటింటా ఓటర్ల సర్వేలో వచ్చిన దరఖాస్తులను పక్కాగా పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకోవాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమార్ అన్నారు. టెక్కలి నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, అధికారులతో బుధవారం తన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బీఎల్‌ఏ నియామకాలు చేసుకోవాలన్నారు. పోలింగ్‌స్టేషన్, పేర్ల మార్పులపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన చేయాలని సబ్‌కలెక్టర్ వెల్లడించారు. అలాగే ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కోటబొమ్మాళి, నందిగాం మండలాల్లో కొన్నిచోట్ల పోలింగ్‌స్టేషన్ మార్పుపై అభ్యంతరాలను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్లు కె.ప్రవళ్లికప్రియ, జె.ఈశ్వరమ్మ, కె.చలమయ్య, పద్మావతి, ఎలక్షన్ డీటీలు నలినాక్షి పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే


తేలుకుంచిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరుగుతుందని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు అన్నారు. 21 గ్రామ పంచాయతీల్లో వలంటీర్లు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు తమ క్లస్టర్ల వారీగా బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబంలో వ్యక్తుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఏ ఆరోగ్య సమస్య ఉన్నా ప్రభుత్వం తరఫున వైద్య సేవలు అందిస్తామని కొళిగాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై.కల్యాణి తెలిపారు.
కవిటి: మండలంలోని వివిధ పీహెచ్‌సీల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జోరుగా నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, వలంటీర్లు సర్వేలో పాల్గొన్నారు. సర్వేకు సహకరించాలని వైద్యాధికారులు కోరారు.

జోరుగా విద్యుత్ పనులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటీ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలాస ఈఆర్‌వో కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాదరావు ఆదేశానుసారం పలాస నుంచి కాశీబుగ్గ వరకు ఉన్నటువంటి రెండున్నర కిలోమీటర్ల రోడ్డుకు ఇరువైపులా పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి వేశారు. విద్యుత్ పనులు మూడు రోడ్లు కూడలి నుంచి ప్రారంభమై పలాస ఇందిరాచౌక్ వరకు పూర్తయ్యాయి లైన్ ఇన్‌స్పెక్టర్ గార రాజారావు, ఏఈలు భూషణ్, వివేకానంద, పలువురు లైన్‌మెన్లు, సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారు.


కంచిలి ఎక్కల గ్రామంలో బొజ్జగణపయ్య


ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


కంచిలి: ఎస్.ఆర్.సి.పురం కాలనీలో..


నందిగాం: కణితూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న పేరాడ తిలక్


కవిటి: బొరివంక ఒరియా వీధిలో కొలువుదీరిన శ్వేతార్కగణనాథుడు

మదిమదిలో బొజ్జ గణపయ్య

ఊరూరా వినాయక నామస్మరణతో మారుమ్రోగుతోంది. గల్లీగల్లీ ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. మదిమదిలో విఘ్నేశ్వరుడే. గణపతి నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన బుధవారం భక్తులు మండపాలకు వెళ్లి బొజ్జగణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించి తరించిపోయారు. సాంస్కృతిక కార్యక్రమాలు జోరందుకున్నాయి. కాగా కొన్ని గ్రామాల్లో గణపతి విగ్రహాల నిమజ్జనాలు సైతం జరిగాయి. యువకులు భారీ విగ్రహాలను వాహనాలపై తరలిస్తూ సందడి చేశారు. తరువాత చెరువులు, సముద్రంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.
–సాక్షి నెట్‌వర్క్


కవిటి: కొత్తపుట్టుగలో అలరించిన వినాయకుడు


కోటబొమ్మాళి బజార్ వీధిలో కొలువుదీరిన గణనాథుడు


మందస: కిల్లోయి కాలనీలో కుంకుమ పూజలు చేస్తున్న గిరిజన మహిళలు


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు


ఇచ్ఛాపురం రూరల్: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


వజ్రపుకొత్తూరు రూరల్: శారదపురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


కోటబొమ్మాళి: సీతంపేటలో పూజలందుకుంటున్న గణేశుడు

మంచిని చూసి అండగా నిలవండి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
- నరేంద్రపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


పాలవలసలో లబ్ధిని వివరిస్తున్న దువ్వాడ వాణి

నందిగాం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో జరిగిన మంచిని చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. నరేంద్రపురం పంచాయతీ పాలవలస, నరేంద్రపురం, నారాయణపురం, పాతినివానిపేటలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని చదివి వినిపించి బ్రోచర్లను అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నామన్నారు. నాలుగేళ్ల పారదర్శక పాలనలో ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడిందన్నారు. అందరికీ మంచి చేస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంపతిరావు రాఘవరావు, డాక్టర్ దువ్వాడ హైందవి, మోహన్, పంచాయతీ సమన్వయకర్త తుంగాన శాంతారావు, బంగారి బాలరాజు, అట్టాడ శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పూడి ఆశారాణి, జేసీఎస్ చైర్మన్ జడ్యాడ జయరాం, తమిరె ఫాల్గుణరావు, తమిరె బలరాం, కణితి నారాయణమూర్తి, రమణ, కంచరాన శ్రీధర్, కవిటి వీరన్న

మహిళా బిల్లు ఆమోదంపై హర్షం


కాశీబుగ్గ: రోటరీనగర్‌లో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

కాశీబుగ్గ: మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ఆమోదించడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. పార్లమెంట్, అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ బిల్‌ను ఆమోదించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే కాశీబుగ్గ బంకేశ్వర ఆలయం వద్ద, కాశీబుగ్గలో రోటరీనగర్‌లో కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రామానంద స్వామి, లక్కోజి ధర్మారావు, పాలవలస వైకుంఠరావు, వైశ్యరాజు రాజు, కొర్రాయి బాలక్రిష్ణ, మహిళలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం: కేంద్ర ప్రభుత్వం నారీశక్తివందన్ పేరుతో పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టడంపై ఆనందంగా ఉందని బీజేపీ మహిళా నేతలు అన్నారు. బిల్లుకు పార్లమెంటులో ఆమోదం లభించడంతో మహిళలు ప్లకార్డులు పట్టుకొని ప్రదర్శన చేశారు. ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మహిళామోర్చ అధ్యక్షురాలు ఎల్.నీలవేణి, హేమ, శశి పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన సీఎం జగన్


నందిగాం: రైతులకు పాసుపుస్తకాలు అందజేస్తున్న పేరాడ తిలక్

నందిగాం: స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జరిగిన భూసర్వేను తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టి చరిత్ర సృష్టించారని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. కణితూరులో వీఆర్వో పేరాడ యుగంధర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా రైతులకు జగనన్న భూహక్కు పత్రం భూయజమాన పట్టాదారు పాసుపుస్తకాలను 458 మందికి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో భూ వివరాలు సరిగా లేనప్పటికీ గత ప్రభుత్వాలు సర్వే వైపు కనీసం ఆలోచనలు చేయలేకపోయావన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక సమగ్ర భూసర్వే చేపట్టారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ఈ సర్వేతో రైతుల హక్కులు మరింత భద్రంగా ఉంటాయని తెలిపారు.


కంచిలి: పాసుపుస్తకాలు అందజేస్తున్న దేవదాస్‌రెడ్డి

జగనన్న శాశ్వత భూహక్కుతో ప్రయోజనాలు

కంచిలి: జగనన్న శాశ్వత భూహక్కుతో అధిక ప్రయోజనాలు కలుగుతున్నాయని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. కొల్లూరు సచివాలయం పరిధిలోని ఎ.ఎస్.పల్లి గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు పథకం ద్వారా మంజూరైన భూపట్టా పాసుపుస్తకాలను 278 మందికి అందజేశారు. సర్వేయర్ శివకుమార్, గ్రామ రెవెన్యూ అధికారి కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పైల లక్ష్మీనారాయణ, గేదెల రాజు, బి.ఆనంద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- సంతబొమ్మాళి మండల సమావేశం


మాట్లాడుతున్న దువ్వాడ వాణి

సంతబొమ్మాళి: ప్రభుత్వం అందజేస్తున్న నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పంచాయతీరాజ్ శాఖ పనులపై జరిగిన సమీక్షలో వాణి మాట్లాడుతూ.. సచివాలయానికి జీజీఎంపీ నిధులు రూ. 40 లక్షలు ఉన్నాయన్నారు. పనులు పూర్తి చేస్తే బిల్లులు సకాలంలో మంజూరయ్యేలా చూస్తానని భరోసా ఇచ్చారు. మండలంలో నిర్మాణం జరిగిన గ్రామ సచివాలయ, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లకు బిల్లులు చెల్లించామని, 17 భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని పంచాయతీరాజ్ ఏఈ విష్ణుప్రియ చెప్పారు. సంతబొమ్మాళి గ్రామ సచివాలయ నిర్మాణానికి 1440 సిమెంటు బస్తాలు, ఇసుక తీసుకున్న నిర్మాణ పనులు చేయకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ జగన్నాథ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఏఈ తెలిపారు. నిర్మాణం జరగకుండా సిమెంటు, ఇసుక ఇచ్చిన అప్పటి పంచాయతీరాజ్ ఏఈపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని దువ్వాడ వాణి అన్నారు.
పెండింగ్ బిల్లులన్నీ త్వరగా చెల్లించాలని హౌసింగ్ ఏఈ నరసింహమూర్తిని ఆమె ఆదేశించారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన యూరియా, తదితర మందులను అందరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏవో శ్రీలక్ష్మి ని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాల ని సూచించారు. జలజీవన్ మిషన్ పథకంలో భా గంగా పైప్‌లైన్లు వేసే క్రమంలో రోడ్లని తవ్వి అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత కాంట్రాక్టర్‌కు తెలియ జేసి అ సమస్య రాకుండా చేయాలని సూచించారు. అంతకుముందు హౌసింగ్ ఏఈ నరసింహమూర్తి విధులకు గైర్హాజర్, ప్రజలకు అందుబాటులో లేకపోవడం, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించ డం పట్ల క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సభ్యు లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. వంశధార ఏఈ సర్వసభ్య సమావేశానికి గైరహాజరు కావడంతో నోటీసులను జారీ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, వైస్ ఎంపీపీలు నక్క చింతామణి, పొందల తులసమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపీడీవో ప్రేమలీల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా..


రాజారావుకు సాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురం గ్రామానికి చెందిన తమ్మినాన రాజారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన-2003 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు స్నేహితునికి అండగా నిలిచారు. రూ. 37 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని రాజారావుకు బుధవారం అందజేసి.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు టొంప భాస్కరరావు, శిష్టి గౌతమ్, ఎస్.లీలామోహన్, బగాది హరిశంకర్, తిమ్మల కిరణ్ ఉన్నారు.

పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన


కవిటి: మాట్లాడుతున్న కడియాల ప్రకాష్

కవిటి: గర్భిణులు, బాలింతలకు విధిగా పోషకాహారాన్ని తీసుకోవాల్సిన అవశ్యకతపై సమగ్ర అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపైనే ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. ఆర్.బెలగాంలో బుధవారం పోషకాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంట్లోనే తక్కువ ఖర్చుతో తయారు చేసుకునేందుకు వీలైన పోషకాహారాన్ని ప్రదర్శించారు. గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దిలి ఈశ్వరరావు, దూపాన నేతాజీ, బాసుదేవరాణో, సంతోష్‌పట్నాయక్, మణిచంద్రప్రకాష్ పాల్గొన్నారు.

ధర్మపురంలో..

ఇచ్ఛాపురం రూరల్: స్త్రీశిశు సంక్షేమ శాఖ ఇచ్ఛాపురం రూరల్ ఆధ్వర్యంలో ధర్మపురం గ్రామంలో పోషణ మహా మాసోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో పురాణం నాగరాణి మాట్లాడుతూ.. వ్యక్తి శారీరక, మానసిక పెరుగుదలకు చిరుధాన్యాలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పది మంది గర్భిణులకు శ్రీమంతాలు చేశారు. అనంతరం బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లులకు వైఎస్సార్ పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ పిట్ట రుక్మిణీ, ఎంపీటీసీ సభ్యుడు పిట్ట విశ్వనాథం, సూపర్‌వైజర్లు ఎస్.నీలవేణి, బి.సుజాత, గ్రామ సచివాలయ సిబ్బంది, లొద్దపుట్టి క్లస్టర్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఉత్తమ ప్రిన్సిపాల్‌కు సత్కారం


టెక్కలి: ప్రకాశరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

టెక్కలి: రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా డీవీఈవో కోట ప్రకాశరావు ఇటీవల బహుమతి అందుకున్నార. ఈ సందర్భంగా బుధవారం కళాశాల సిబ్బంది ఆత్మీయ సన్మానం చేశారు. టెక్కలి, నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రకాశరావు దంపతులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి..

కంచిలి: ఎం.ఎస్.పల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జోగి మహాంతి స్వప్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఇటీవల అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఎంఈవో-2 కె.చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయులు కూర్మారావు పాల్గొన్నారు.


ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరం పరిసరాల్లోని నీలకంఠేశ్వర ఆలయం 12వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కళాకారులను సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడ మద్దు నాగేశ్వరరావు ఉన్నారు.

క్రీడాకారులకు కిట్లు వితరణ

కాశీబుగ్గ: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు శిష్టు ప్రియమణి, జి.ఛాయ కిరణ్‌లకు క్రీడాకిట్లను వితరణ చేశారు. కాశీబుగ్గలో పనిచేస్తున్న ఓ ప్రభుత్వ అధికారి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ. ఆరు వేలు విలువైన కిట్లను బుధవారం కాశీబుగ్గ జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద అందజేశారు. బోనెల గోపాల్, బత్తిని ఒంకార్, కిషోర్‌పాత్రో, బోకర దుర్యోధన, పీఈటీ శ్యామలరావు, టి.గణేష్‌కుమార్ ఉన్నారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా గోపాల్


కేవీ గోపాల్

కాశీబుగ్గ: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన రైస్ మిల్లర్ కేవీ గోపాల్ మూడోసారి ఎంపికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ గోపాల్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. గోపాల్ నియామకంపై పలాసకు చెందిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డోకి రామారావు, సిందిరి కిశోర్, వీరాస్వామి హర్యం వ్యక్తం చేశారు.

కూలిన రిటైనింగ్ వాల్

కంచిలి: గోకన్నపురం మొగలి చెరువు వద్ద గల బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో బుధవారం కురిసిన వర్షానికి రిటైనింగ్ వాల్ కూలిపోయింది. దీంతో కూలిపోయిన బ్రిడ్జి పైనుంచి వాహనాలు రాకపోకలు చేయవద్దని సర్పంచ్ యారాడి ఆనందరావు, కార్యదర్శి లీలావతి సూచించారు. గ్రామస్తులతో కలిసి కూలిని రిటైనింగ్‌వాల్‌ను పరిశీలించారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

మత్స్యకార సంఘ అధ్యక్షుడుగా లోకనాథం


లోకనాథాన్ని అభినందిస్తున్న ప్రతినిధులు

సోంపేట: బారువ కొత్తూరు గ్రామ మత్స్యకార సంఘం అధ్యక్షుడుగా అమర లోకనాథం ఎన్నికయ్యారు. వాసుపల్లి అశోక్‌పై 22 ఓట్ల మెజార్టీతో లోకనాథం గెలిపొందారు.

వైద్యానికి ప్రాధాన్యం

సోంపేట: వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట సామాజిక ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య మేళాలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాజిక ఆస్పత్రి వైద్యులు మంచు ప్రదీప్, పి.నవీన్, లతాశ్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.